# రహస్యం

"ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేసే మీ స్నేహితుడు పంపించారు నన్ను." అన్నాను అతను చూపించిన కుర్చీలో కూర్చుంటూ.

"ఎకౌంట్ తెరుస్తారా మా బ్యాంకులో" అడిగాడు ఆఫీసర్‌గా పని చేస్తున్న అతను మర్యాదయిచ్చి. రుక్మిణికి అన్ని విధాలా తగిన వరుడనుకున్నాను.

"లేదు రహస్యంగా మాట్లాడాలి ఓ సంగతి."

"చెప్పదగ్గదయితే ఇక్కడే మాట్లాడండి."

రుక్మిణిని నేను గాఢంగా ప్రేమిస్తున్నానని, మా ఆరు నెలల పరిచయం శాశ్వతం కాకపోతే బ్రతకలేనని చెప్పే ధైర్యంలేక ఫోటో ఆల్బం అందించాను.

ఎందుకని అడగకుండా, ఇలాంటివి అలవాటేనన్న ధోరణిలో చిరునవ్వుతో ఆల్బం తిరగేయసాగాడు, ఆఫీసరు పేపర్ చూస్తున్నట్లుగానే.

రేపు రుక్మిణిని చూడటానికి వెళుతున్నాడు పెళ్ళి చూపులకి. అందమయిన బీదపిల్లను కట్నంలేకుండా చేసుకోదలచుకొన్న ఆదర్శ యువకుడితను. రుక్మిణిని చూస్తే తప్పక అంగీకరిస్తాడు నా ప్రేమనౌకకి లంగరులా దాపరించాడు. అలా జరగనివ్వకూడదు.

కార్డుసైజు ఫోటోలు ఆ ఆల్బంలో ఓ డజనదాకా ఓ ఫోటో స్టూడియోవున్న మిత్రునిదగ్గర సంపాదించాను అమ్మాయిలవి.

"ఎంత?" అడిగాడు ఓ ఫోటో చూపించి.

"ఏభై ....రాత్రంతా" చెప్పాను అచ్చం అలాంటి వ్యాపారస్తుడిలా.

అతను మరో రెండు మూడు ఫోటోలు చూశాక, రుక్మిణి ఫోటో వంక చూసాడు. అతని కళ్ళు అతుక్కున్నట్లుగా రుక్మిణి ఫోటో మీద నిలిచిపోయాయి.

నా గుండెలో దేవినట్లుగా వుంది.

"ఎంత?" అడిగాడు నెమ్మదిగా

"రేపే ఈ అమ్మాయికి పెళ్ళిచూపులు వ్యాపారం ఇవాల్టి నుంచి మానేసానని చెప్పింది. అందరి కన్నా ఖరీదయినబొమ్మ. రాత్రికి వందతీసుకునేది"

నాఆరాధ్య దేవత రుక్మిణినిగురించి అంతనీచంగా, అసహ్యంగా తప్పుగా కావాలని అబద్ధం ఆడుతుంటే, నా గుండెలు చిక్కబట్టుకోవలసి వచ్చింది.

కొన్ని క్షణాలు రుక్మిణి ఫొటోవంక తదేకంగా చూసి, ఆల్బం పేజీలు తిప్పుతూ అన్నాడు. మర్నాడు రుక్మిణి పెళ్ళి చూపులు చూడటానికి వెళ్ళబోయెఅతను, అతి మామూలుగా.

"ఆఖరిసారి కాబట్టి వందకు ఒప్పుకుంటుందేమో అడిగి చూడండి! మొన్న శనివారం రాత్రి రుక్మిణీకి నేను ఏభై మాత్రామే ఇచ్చానని కూడా చెప్పండి.... నిజానికి నాకూ ఇదే ఆఖరిపారి కావచ్చు."

✻